క్లుప్తంగా

టంగుటూరు శ్రీ పెద్దమ్మ జాతర ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

బనగానపల్లెరూరల్: మండలంలోని టంగుటూరు గ్రామ శ్రీపెద్దమ్మ జాతర నేపథ్యంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అర్ధరాత్రి నుంచి దేవరకు సంబంధించిన క్రతువు సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు గ్రామ పెద్దలు అన్ని ఏర్పాట్లు చేశారు. అమ్మవారి జాతరకు బుధవారం భక్తులు పెద్దఎత్తున తరలిరానున్న నేపథ్యంలో సీఐ సుబ్బరాయుడు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. టంగుటూరు మీదుగా నంద్యాలకు వెళ్లు లారీ, టిప్పర్ తదితర భారీ వాహనాలను కోవెలకుంట్ల మీదుగా వెళ్లేలా మళ్లించారు. వాహనచోదకులు నిబంధనలు పాటించాలని పోలీసులు తెలిపారు.

వెంకాయపల్లె ఎల్లమ్మకు సామూహిక బోనాలు



బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

బేతంచెర్ల: పట్టణంలోని జంగాలపేట కాలనీకి చెందిన భక్తులు వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం సామూహికంగా బోనాలు సమర్పించారు. కాలనీ పెద్దలు బాల సుంకన్న, శ్రీను, రాంబాబు, నాగరాజు, జమ్మన్న, నడిపి మద్దిలేటి ఆధ్వర్యంలో మంగళవాయిద్యాల మధ్య మహిళలు బోనాలతో గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి అయ్యల చెర్వులో వెలసిన వెంకాయపల్లె ఎల్లమ్మకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

మెనూ పాటించాలి



మెనూ పట్టికను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కొలిమిగుండ్ల: చిన్నారుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఎంతో శ్రద్ధ తీసుకుంటుందని అంగన్వాడీ కేంద్రాల్లో తప్పక మెనూ పాటించాలని ఎంపీడీఓ సుబ్బరాజు సూచించారు. మంగళవారం బెలుంలోని ఒకటవ అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతల వివరాలపై ఆరా తీశారు. గుడ్ల నాణ్యతను పరిశీలించారు. మెనూ పట్టికను పరిశీలించిన ఎంపీడీఓ అమలు చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు.

సన్మానం



పక్కీరయ్యను సన్మానిస్తున్న నాయకులు

డోన్ టౌన్: అనంతపురం జిల్లా రాయదుర్గం ఆర్టీసీ డిపో స్క్వాడ్ ఇన్‌చార్జ్‌గా పదోన్నతిపై వెళ్తున్న డోన్ ఆర్టీసీ సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పక్కీరయ్యను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఆయనకు ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, సభ్యులు శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. పక్కీరయ్య సేవలను గుర్తుచేశారు.కార్యక్రమంలో ఈయూ డిపో కార్యదర్శి ఐవీఆర్‌రెడ్డి, నాయకులు రమణారెడ్డి, చాంద్‌బాషా, ఎంఎస్ నారాయణ, కుమార్, దాస్, నాగేంద్ర, ఒకే రెడ్డి, జిలానీ, చంద్రుడు, రంగస్వామి, రాజు పాల్గొన్నారు.

పూదోట ఆశ్రమంలో సత్య నారాయణస్వామి వ్రతం

బేతంచెర్ల: పట్టణంలోని పూదోట ఆశ్రమంలో పాల్గుణ మాస పౌర్ణమిని పురస్కరించుకొని మంగళవారం ఉదయం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. శ్రీ రమాదేవి సమేత సత్యనారాయణ స్వామికి అర్చకుడు ప్రభాకర్ శర్మ శాస్త్రోక్తంగా మంత్రాలు చదువుతూ అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి ఇచ్చారు. వ్రతం యొక్క మహత్యాన్ని ఆయన భక్తులకు వివరించారు.

9 నుంచి శనగ కొనుగోలు కేంద్రాలు

అవుకు: అవుకు సమీపాన కోవెలకుంట్ల రహదారిలో ఉన్న రైస్‌మిల్ వద్ద ఈ నెల 9 నుంచి శనగ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు ఏఓ ప్రసాద్‌రావు మంగళవారం తెలిపారు. రబీ సీజన్‌కు సంబంధించిఅవుకు మండలపరిధిలో 2,230 హెక్టార్లలో శనగ పంటసాగు జరిగిందని, బహిరంగ మార్కెట్‌లో శనగ ధరలు తక్కువగా ఉన్నందున ప్రభుత్వం రైతులకు మద్దతు ధరగా రూ. 5335 ప్రకటించిందని తెలిపారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో శనగ దిగుబడులు అమ్ముకోదలచిన రైతులు ఆర్బీకేల్లో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు 252 మంది రైతులుపేర్లనునమోదు చేసుకున్నారని ఏఓ తెలిపారు.

మహిళలు... మహారాణులు

- అన్నిరంగాల్లో 'రాణి'స్తున్న స్త్రీలు
- అభివృద్ధి బాటలుగా మారిన అబలలు

రాజరికంలో రాజు భార్య మాత్రమే మహారాణి. ప్రస్తుతం చైతన్యవంతులైన మహిళలు తాము అన్నిరంగాల్లో రాణులమే అని నిరూపిస్తున్నారు. మంచి గుర్తింపూ తెచ్చుకుంటున్నారు. రాజకీయ, విద్య, వ్యాపార తదితర రంగాల్లోనూ మెరుస్తున్నారు. రాజకీయంగా అన్ని హోదాల్లోనూ తమ ప్రతిభను చాటుతున్నారు. అమాత్యులుగానూ తమ సత్తాచాటుతూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, ఇంజినీర్లుగా తాము పురుషులకు ఏ మాత్రం తగ్గమని తేల్చిచెబుతున్నారు కూడా. విద్యావంతుల విషయం అటుంచుతే... నిరక్షరాస్యులు సైతం పురుషులకు ఏ విషయంలోనూ తగ్గమంటూ పోటీ పడుతున్నారు. కుటుంబానికి అండగా నిలుస్తూ భాగస్వాముల అవుతున్నారు. అరకొర చదువుతోనే స్వయం ఉపాధిపై దృష్టి సారిస్తూ అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. కొందరు పురుషులు చేసే కష్టాలను సైతం సునాయసంగా చేస్తూ అబల కాదు సబల అని నిరూపిస్తున్నారు. మరికొందరు కష్టాలను ఎదురీదుతూ భర్త దిక్కు లేకున్నా రెక్కల కష్టంతో జీవనం ముందుకు సాగిస్తున్నారు. 'మగ దిక్కు కాదు... మేమే మీకు దిక్కు' అనే అర్థం వచ్చేలా కాయకష్టం చేస్తున్నారు. ఎవరి అండ లేకున్నా పిల్లలను పోషించుకుంటూ విద్యాబుద్ధులు నేర్పుతున్నారీ అమ్మలు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో జీవన ప్రయాణంలో పోరాడుతున్న కొందరి సబలల విజయాలు ఇలా ఉన్నాయి.

– బనగానపల్లె/ డోన్



టీ స్టాల్, చెరుకు మిషన్ నిర్వహిస్తున్న సుజాత

కుటుంబ కలహాల నేపథ్యంలో ఒంటరైన ఈమె తన ఇద్దరు పిల్లలకు అన్నీతానై కష్టపడుతోంది. డోన్ పాతపేటకు చెందిన సుబ్రహ్మణ్యం, వసుందరమ్మ దంపతుల కుమార్తె సుజాతను బళ్లారికి చెందిన అశోక్‌తో వివాహమైంది. రెండేళ్లు సజావుగా సాగిన వీరి సంసారం విడాకుల వరకు దారితీసింది. అయినా ఒంటరిగానే జీవనం పోరాటం చేస్తుంది. పట్టణ పోలీసు స్టేషన్ వద్ద సుజాత తల్లిదండ్రుల సహకారంతో టీ బంక్ ఏర్పాటు చేసుకుంది. టీతోపాటు వేసవిలో చెరుకు మిషన్ నిర్వహిస్తూ ముందుకు సాగుతుంది. కుమారుడు నరసింహ, కూతురు సంధ్యను ప్రముఖ ప్రైవేట్ కళాశాలల్లో బీటెక్ చదివిస్తోంది. పిల్లల బాగు కోసం ఆమె పడుతున్న కష్టాన్ని ప్రతిఒక్కరూ అభినందిస్తున్నారు.

– డోన్ టౌన్

ఈమె డోన్ పట్టణంలోని కొండపేటకు చెందిన భారతి. భర్త లక్ష్మణమూర్తికి ఆటో డ్రైవర్. వీరికి ఇద్దరు ఆడపిల్లలు, కుమారుడు. భర్త ఆటో నడుపుతూ తెస్తున్న సంపాదన కుటుంబ పోషణ, పిల్లల చదువులకు ఏమాత్రం సరిపోవడం లేదు. దీంతో భర్త సాయంతో ఆటో నడపడం నేర్చుకుంది భారతి. ఐదేళ్లుగా కాలనీల పిల్లలను స్కూల్‌కు వదిలిరావడం. తీసుకురావడం చేస్తూ కొండపేట ప్రాంత ప్రజలకు ఆప్తురాలైంది. ఆర్థికంగా కుటుంబానికి అండగా నిలిచింది. గతేడాది పెద్దకూతురు మంజులకు వివాహం చేసింది. రెండవ కూతురు పద్మావతి జెడ్పీ గరల్స్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదివిస్తుంది. ఆఖరి కుమారుడు యశ్వంత్‌ను పాతపేట ప్రభుత్వ హైస్కూల్‌లో 7వ తరగతి చదివిస్తోంది. మన పిల్లలు బాగుండాలంటే కష్టపడాలి అంటుంది నిజాయతీగా ఆటో భారతి.

– డోన్





పిల్లలను స్కూల్‌కి తీసుకువస్తున్న ఆటో భారతి

ఇరవై ఏళ్లుగా ఒంటరి జీవితం..

నిరక్షరాస్యురాలైన ఈమె అవుకు పట్టణానికి చెందిన గుర్రాల రామలక్ష్మమ్మ. భర్తతోపాటు ముగ్గురు పిల్లలు సంతానం ఉన్నా ఒంటరిగాజీవనం సాగిస్తుంది. ఇరవై ఏళ్లుగా గౌండా పనులుచేస్తూ ముందుకు సాగుతోంది. కుటుంబ కలహాల నేపథ్యంలో భర్త పిల్లలను తీసుకెళ్లినా ధైర్యంగా నిలబడిందీమె. కొన్నేళ్లు కుంగిపోయినా తనకు తానే సమాధానం చెప్పుకుని కష్టాలను దిగమింగింది. తండ్రి, తమ్ముళ్ల సాయం తీసుకోకుండా అద్దె ఇంట్లో జీవనం సాగిస్తూ కూలి పనికెళ్తూ తనకాళ్లపై తాను నిలబడింది. భర్త, పిల్లలు పట్టించుకోకున్నా జీవించొచ్చని నిరూపిస్తున్న ఈమె ధైర్యాన్ని మెచ్చుకోక తప్పదు.

– అవుకు



నేడు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన డోన్‌కు రాక

- సాయిశ్రీ ఫంక్షన్ హాల్‌లో సమావేశం

డోన్ : ఎమ్మెల్సీ ఎన్నికలు ఈనెల 13వ తేదీన జరగనున్న నేపథ్యంలో ప్రచారంలో పాల్గొనేందుకు బుధవారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి డోన్‌కు రానున్నారని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సాయిశ్రీ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు జరిగే ప్యాపిలి, డోన్ మండలాలతో పాటు మున్సిపాలిటీకి చెందిన పట్టభద్రులు, ప్రజాప్రతినిధుల సమావేశానికి మంత్రి బుగ్గన ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని బేతంచెర్ల మినహా మిగిలిన మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సమావేశానికి హాజరుకావాలని వారు కోరారు.

విద్యార్థులకు క్రీడా పరికరాలు పంపిణీ

డోన్ రూరల్ : మండల పరిధిలోని యు.కొత్తపల్లి గ్రామంలో ఉన్న జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం హెచ్‌ఎం చంద్రశేఖర్ చేతుల మీదుగా క్రీడా పరికరాలు అందజేశారు. యు.కొత్తపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి చాటకొండ చిన్నమద్దయ్య పుట్టిన రోజు సందర్భంగా రూ. 60వేల పంపిన క్రీడా పరికరాలను హెచ్‌ఎం విద్యార్థులకు పంపిణీ చేశారు. అదేవిధంగా క్రీడల్లో మెడల్స్ సాధించిన 14మంది క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

గడువు ముగిసిన బీరు బాటిళ్లు ధ్వంసం



బీరును పారబోస్తున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు

అవుకు: గడువు ముగిసిన బీరు బాటిళ్లను మంగళవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు ధ్వంసం చేశారు. నంద్యాల జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారి రవికుమార్ రెడ్డి ఆదేశాల మేరకు అవుకు మండల పరిధిలోని రామాపురం మద్యం షాపులో కాలం చెల్లిన బీర్లు ఉన్నాయని తెలియటంతో దాడులు చేపట్టామని ఆ శాఖ సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. కాలం చెల్లిన భూమ్ భూమ్, బ్రిటీష్, బ్లాక్‌బాస్టర్ తదితర రకాల 191 బీరు బాటిళ్లను గ్రామం సమీపంలోని కాల్వ వద్దకు తీసుకెళ్లి బీరును పారబోశామని తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుల్ ఆదాం సూపర్‌వైజర్ సుధాకర్,సేల్స్ మేనేజర్ వంశీ, వలంటీర్లు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు అండగా నిలువాలి



పోషక ఆహార సరుకులు అందిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: క్షయ వాధిగ్రస్తులకు స్థిరపడిని వ్యక్తులు అండగా నిలువాలని తాలూక యూనిట్ లెప్రసీ అధికారి రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక కొండపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఎన్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న శ్రీగౌరీ ఐదుగురు క్షయ వ్యాధిగ్రస్తులను నిక్షయ మిత్ర కింద దత్తత తీసుకొని 6నెలలకు సరిపడే పోషక ఆహార సరుకులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిపట్ల తగిన జాగ్రత్తలు తీసుకుంటూ క్రమం తప్పకుండ మందులు వాడితే వ్యాధి నయం అవుతుందన్నారు. శ్రీగౌరీని అయనతో పాటు తోటి సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్స్ హేమలత, ధర్మశేఖర్,క రీముల్లా తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ముస్లిం శ్మశానవాటిక ప్రహరీ పనులు



ముస్లిం శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: పట్టణంలోని కేజీబీవీ పాఠశాల సమీపంలోని ముస్లిం శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణ పనులు చురుగ్గాకొనసాగుతున్నాయి. గతంలో ఈ శ్మశానవాటికకు ప్రహరీ లేనందున పశువులు, పందులు సంచరిస్తున్న నేపథ్యంలో ముస్లిం పెద్దలు సమస్యను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కాటసాని సంబంధింత అధికారులతో కలిసి, స్వయంగా శ్మశాన వాటికను పరిశీలించి, సర్వే చేయించారు. ప్రత్యేకంగా ముఖ్యమంత్రి అభివృద్ధి నిధుల కింద రూ.69 లక్షలు మంజూరు చేయించారు.ఈ మేరరకు చేపట్టిన ప్రహరీ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఏప్రిల్ చివరిలోపు ప్రహరీ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు పంచాయతీ రాజ్ శాఖ మండల ఏఈ వెంకటరమణ తెలిపారు.

ఉగాదికంతా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

కోవెలకుంట్ల: నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఉగాది పండగనాటికి పక్కాగృహాల నిర్మాణాలను పూర్తి చేయాలని తహసీల్దార్ పుష్పకుమారి, ఎంపీడీఓ మహబూబ్‌దౌలా సూచించారు. మంగళవారం మేజర్ గ్రామ పంచాయతీలోని జగనన్న కాలనీల్లో జరుగుతున్న పక్కాగృహాల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పక్కాగృహానికి ప్రభుత్వం మూడు విడతల్లో రూ. 1.80 లక్షలతోపాటు ఉచితంగా 20 టన్నుల ఇసుక, రాయితీపై సిమెంట్, ఇనుప కడ్డీలు తదితర సామగ్రి అందజేస్తోందన్నారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని సొంతింటి కల నెరవేర్చుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధిక, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ ఇమ్రాన్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తండాల్లో హోలీ సంబరాలు





అలేబాదుతండాలో రంగులు చల్లుకుంటున్న ప్రజలు, బుగ్గానిపల్లె తండాల్లో రంగుల చల్లుకుంటున్న యవకులు

ప్యాపిలి: మండల పరిధిలోని అలేబాదుతండా, సీతమ్మతండా, లక్ష్మీతండాల్లో మంగళవారం తండావాసులు హోలీ సంబరాల్లో మునిగితేలారు. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా పరస్పరం రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. హోలీ సందర్భంగా తండాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా తండాల్లోని అమ్మవారి ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. బుధవారం హోలీ సందర్భంగా గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా హోలీ వేడుకలు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని ఉమ్మాయిపల్లె తండా, నాగిశెట్టిపల్లె తండాల్లో మంగళవారం హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. రెండు తండాల్లో చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు వీధుల్లోకి చేరి ఆనందోత్సాహల మధ్య రంగులు చల్లుకుంటు ఉత్సాహంగా గడిపారు. అలాగే కల్వటాల సమీపంలోని రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీలో నిర్మాణ పనులు చేసేందుకు వచ్చిన వివిధ రాష్ట్రాల కార్మికులు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు.

బేతంచెర్ల : మండల పరిధిలోని బుగ్గానిపల్లె తండా, గోరుమానుకొండ తండా గ్రామాలలో హోలీ పండుగ వేడుకలను ఉల్లాసంగా జరిగాయి. గ్రామదేవతలైన సేవలాల్ మహారాజ్, మారెమ్మ దేవతలకు మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. యువకులు ఈలలు కేరింతల మధ్య రంగులు చల్లుకొని సంబరాలు చేసుకున్నారు. గ్రామంలో సందడి నెలకొంది.

వైఎస్సార్‌సీపీలోకి వలసలను.. ఓర్వలేకనే విమర్శలు



సమావేశంలో మాట్లాడుతున్న యనకండ్ల గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు

బనగానపల్లె: కొంత కాలంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలోనికి చేరుతున్నందున ఓర్వలేక టీడీపీ నాయకులు అసత్యారోపణలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. ఈ నెల 5న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి స్వంత గ్రామం యనకండ్ల నుంచి టీడీపీకి చెందిన నొస్సం సాంబశివారెడ్డి, ఆయన కుమారుడు మహేశ్వరరెడ్డితో పాటు మరో 10 కుటుంబాలు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన విషయం తెలిసిందే. అయితే వారు టీడీపీ నాయకులే కాదు... సభ్యత్వం కూడా లేదంటూ ఆ పార్టీ నాయకులు మాట్లాడాన్ని మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహం వద్ద వారు విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తప్పుపట్టారు. తాము వైఎస్సార్‌సీపీలో చేరిక వల్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు బొబ్బల గోపాల్‌రెడ్డి మరికొందరు తమకు టీడీపీ సభ్యత్వమే లేదని, టీడీపీలో లేమని పేర్కొనడం హాస్యాస్పదమన్నారు. తాము వైఎస్సార్‌సీపీలో చేరక ముందు ఏ పార్టీలో ఉన్నది గ్రామ ప్రజలందరికీ తెలిసిందే అన్నారు. 2009 శాసన సభ ఎన్నికల్లో అప్పట్లో పీఆర్‌పీ తరుపు పోటీలో ఉన్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గెలుపునకు కృషి చేసిన తాము 2014, 2019 ఎన్నికల్లో బీసీ జనార్దన్‌రెడ్డి టీడీపీ తరుపున పోటీ చేయకగా మా సొంత గ్రామానికి చెందిన వ్యక్తికావడంతో అభిమానంతో బీసీ గెలుపుకోసం టీడీపీలో చేరి పని చేసిన విషయం గ్రామ ప్రజలకు తెలుసన్నారు. అయితే టీడీపీలో జరుగుతున్న అవమానాలు భరించలేక, ఎవరికి చెప్పుకోలేక ఆ పార్టీని వీడి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిపై ఉన్న నమ్మకంతో వైఎస్సార్‌సీపీలో చేరిన విషయాన్ని టీడీపీ నాయకులు ఇప్పటికైనా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు నొస్సం పురుషోత్తంరెడ్డి, కోడూరురామచంద్రారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, శివశంకర్‌రెడ్డి, పాపసాని గోపాల్‌రెడ్డి, మద్దిలేటిరెడ్డి, మాజీ సర్పంచ్ బీసీ మహేశ్వరరెడ్డి, పీ శ్రీనాథ్‌రెడ్డి, బొబ్బల చంద్రశేఖర్‌రెడ్డి వడ్డె సుబ్బరాయుడు, గోల్ల యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బస్‌స్టాప్‌లో ప్రైవేట్ వాహనాలు...రోడ్డుపై బస్సులు!



రోడ్డుపైనే నిలిపిన ఆర్టీసీ బస్సు

కొలిమిగుండ్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రైవేట్ వాహనాలకు అడ్డాగా మారింది. ఆర్టీసీ బస్సులు ప్రధాన రహదారిపైనే నిలుపుతున్నారు. ఆర్టీసీ బస్టాండ్ మీదుగా బనగానపల్లె, తాడిపత్రి, జమ్మలమడుగు, నంద్యాల, కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ,ధర్మవరం తదితర డిపో బస్సులు రాక పోకలు సాగిస్తుంటాయి. బస్టాండ్‌కు చుట్టు పక్కల ఉన్న హోటళ్లు, దుకాణాలు తదితర వాటి కోసం వచ్చే వ్యక్తులు తమ వాహనాలను బస్టాండ్‌లో పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. జమ్మలమడుగు, ఆళ్లగడ్డ,కోవెలకుంట్ల డిపో బస్సులు మాత్రమే బస్టాండ్ ప్రాంగణలోకి వస్తున్నాయి. బనగానపల్లె, తాడిపత్రితో ఇతర డిపో బస్సులు మాత్రం రాక పోకలు సాగించే సమయంలో నడిరోడ్డుపైనే నిలపడంతో వెనుకాల వచ్చిన వాహనాలకు ఇబ్బంది కలుగుతుంది. రోడ్డుపై నిలపడంతో చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు అప్పుడప్పుడు ప్రమాదాల బారిన పడుతున్నారు. బస్టాండ్‌కు ఇరువైపులా వివిధ రకాల దుకాణాలు ఉన్న కారణంగా వాటి కోసం వచ్చే వాళ్లు వాహనాలు పార్కింగ్ చేయడంతో సమస్య తీవ్రమవుతుంది. ప్రత్యేకించి మంగళవారం వారాంతపు సంత ఉండటంతో పరిసర గ్రామాల నుంచి వచ్చే వారంతా బస్టాండ్‌లోనే వాహనాలు పార్కింగ్ చేస్తుంటారు. పోలీసులు మాత్రం అడపా దడపా వచ్చి మొబైల్ సాయంతో వాహనాల నంబర్ పోటో తీసి జరిమానా విధించి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

11 నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయ రజతోత్సవాలు

డోన్ టౌన్: పట్టణంలోని శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం నిర్మించి 25 సంవత్సరాలు అయిన సందర్భాన్ని పురష్కరించుకొని ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు రజతోత్సవాలతో పాటు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11వ తేదీన ఉదయం ఆలయ మాడవీధుల్లో గోష్ఠి వారిచే సత్సంగం, నాలాయిర దివ్య ప్రబంధ పారాయణం, సాయత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా భరతనాట్యం ఉంటున్నారు. 12వ తేది ఉదయం ధ్వజారోహణం,గరుడ సేవ, సాయత్రం శ్రీనివాస కల్యాణం నృత్యరూపకం, 13న శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వర్లస్వామి కల్యాణమహోత్సవం నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా 14వ తేదీన చక్రస్నానం, భాగవతసన్మానం, ద్వాదశ ఆరాధన, ధ్వజఅవరోహణం, రజతోత్సవ స్వస్తి కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీనివాసుని కల్యాణం కనులారా వీక్షించి స్వామి కృప పొందాలని వారు సూచించారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

నంద్యాల(సిటీ): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు ఎంఎస్‌వీ రాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 8 నుంచి 25వ తేదీ వరకు పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీల్లో గెలుపొందిన వారికి 25న బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. వివరాలకు సెల్ 9885240365 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మున్సిపల్ కౌన్సిలర్లకు గుర్తింపు కార్డుల పంపిణీ



కౌన్సిలర్లకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న చైర్మన్ రాజేష్

డోన్ : ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఓటు వేసే విధానంపూ స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లకు మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆధ్వర్యంలో వైస్ చైర్మన్లు కొట్రికె హరికిషన్, జాకీర్ హుసేన్, కమిషనర్ వెంకటేశ్వర్లు ఓటు వేసే విధానం గురించి కౌన్సిలర్లుకు వివరించారు. అనంతరం 32 మంది కౌన్సిలర్లకు మునిసిపాలిటీ తరుపున గుర్తింపు కార్డులను అందజేశారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

- జిల్లా కలెక్టర్ మన్‌జీర్ జిలానీ శామూన్



మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ శామూన్

నంద్యాల: పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సీరియస్‌గా తీసుకోవాలని, నోడల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై నోడల్ అధికారులతో జాయింట్ కలెక్టర్ నిశాంతి, డీఆర్‌ఓ పుల్లయ్యతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ జరిగే పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత నోడల్ అధికారులు పూర్తిస్థాయి బాధ్యత తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 61 పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలు, 30 ఉపాధ్యాయుల పోలింగ్ కేంద్రాలు, 3 స్థానిక సంస్థలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సామగ్రితో పాటు అధికారులను చేరవేసేందుకు డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఆర్‌డీఓలను ఆదేశించారు. సెక్టోరల్ అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రంలోని రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతాన్ని సేకరించి కమాండ్ కంట్రోల్ రూంకు చేరవేయాలని చెప్పారు. ఓటర్లకు ఓటర్ స్లిప్ లు బుధవారం సాయంత్రంలోగా వంద శాతం పంపిణీ చేయాలన్నారు.

క్రైం కార్నర్

కోలుకోలేక వ్యక్తి మృతి

బేతంచెర్ల: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మండల పరిధిలోని గూటుపల్లె గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కర్నూలులో చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు. ఏఎస్‌ఐ క్రిముల్లా బేగ్ వివరాల మేరకు గ్రామానికి చెందిన మద్దిలేటి కుమారుడు బోయ రామకృష్ణ మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో ఫిబ్రవరి 20వ తేదీన జీవితంపై విరక్తి చెంది గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. మృతునికి భార్య రంగమ్మతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని గుంజలపాడు రహదారి పక్కన మంగళవారం సాయంత్రం పేకాట ఆడుతున్న వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు దాడి చేసి వారి నుంచి రూ. 28,030 నగదుతోపాటు పేకముక్కలు స్వాధీనం చేసుకున్నారు. పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.